# రవీంద్ర భారతిలో ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం
# విగ్రహం పెట్టకూడదు
## రవీంద్ర భారతి పేరు కూడా మార్చాలి

**» శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్**

రవీంద్ర భారతిలో ఎస్.పి.బాలసుబ్రహ్మణ్యం విగ్రహం పెట్టకూడదట.
ఎస్పీ బాలు తెలంగాణ గీతాన్ని పాడడానికి అభ్యంతరం చెప్పాడట.

» భావ ప్రకటనా స్వేచ్ఛ మా స్వంతం.
ఎస్పీ బాలుకి భావ ప్రకటనా స్వేచ్ఛ లేదు.
**అతనికి రాజ్యాంగ హక్కులు వర్తించవు .. అంతే..**

అతడు తెలంగాణ గీతంలో వంక పెట్టాడు.అతడు ఆంధ్రా వాడు.అతని విగ్రహం రవీంద్ర భారతిలో పెట్టకూడదు గాక పెట్టకూడదు.

మరి కొండపల్లి సీతారామయ్య తెలంగాణ వాడా? ఆంధ్రాలో పుట్టి తెలంగాణలో పీపుల్స్ వార్ పార్టీ పెట్టి అల్లకల్లోలం చేసిన కొండపల్లి సీతారామయ్య పేరు ఇకపై పలకకూడదు అని అనాల్సిందే.

KG సత్యమూర్తి, నంబాల కేశవరావు మా తెలంగాణ వాళ్ళు కాదు. వాళ్ళు ఆంధ్రా వాళ్ళు, ఇకపై వాళ్లను ఎవ్వరూ స్మరించకూడదు అని వారిని వ్యతిరేకించాల్సిందే.
అని అభినవ విచ్చిన కారుల ప్రశ్నలకు జవాబుగా జెన్ జెడ్ తరం నుండి వినిపిస్తున్న ప్రశ్న ఇది.

జవాబు ఇవ్వండి విద్యావంతులారా!
ప్రగతి శీల వాదులారా!
అభ్యుదయ వాదులారా!

ఈ అసాంఘిక వ్యక్తుల అలజడి వాదనకు ప్రతిగా జెన్ జెడ్ తరం వేస్తున్న ప్రశ్నలకు జవాబు ఇవ్వండి.

**» గర్జించు రష్యా గాండ్రించు రష్యా అని పూనకం రాతలు రాసిన శ్రీ శ్రీ పేరు ఇకపై తెలంగాణలో వినిపించకూడదు. శ్రీ శ్రీ ఆంధ్రా వాడు.**

చైనా దేశస్తుడు “మావో” పేరు ఈ దేశంలో వినిపించకూడదు. మావోయిస్ట్ నక్సలైట్లు తమ పార్టీ లో మావో పేరు తీసేయాలి.
మావో విదేశీయుడు.మార్క్స్, లెనిన్ లు విదేశీయులు. వారి సిద్ధాంతాలు ఈ దేశానికి చెందినవి కావు. ఆ వ్యక్తుల బొమ్మలు ఈ దేశంలో వాడకూడదు.ముఖ్యంగా తెలంగాణలో అస్సలే ఒప్పుకోం

ఎస్పీ బాలు పరాయి వాడైతే, వీళ్ళంతా పరాయి వాళ్ళే కదా!
కాదు కాదు వీళ్ళంతా సిద్ధాంత కర్తలు విశ్వ మానవ సౌభాగ్యాన్ని కోరుకున్నారు అంటారా!

ఏమిటి వీళ్ళు సిద్ధాంత కర్తలా!

మరి బాలు సంగీత కర్త కాదా?

సిద్ధాంతాలకు హద్దులు లేవు అంటారా?
మరి కళలకు హద్దులుంటాయా?
తన సంగీతంతో బాలు విశ్వ మానవుడిగా ఎదగలేదా?

**» కళాకారులకు ప్రాంతం కులం మతం ఉంటుందా? రష్యాకు చెందిన మాక్సిం గోర్కీ రచనలను అమ్మ పేరుతో అనువదించి మాకెందుకు బోధించారు? అతడు మా వాడు కాదు అని అంటే,గోర్కీ ఒక గొప్ప రచయిత సృజన కారుడు అంటారా! అయితే బాలు గారు ఏమిటి? అతడు సృజన కారుడు కాదా?.. తన సంగీతంతో,గాత్రంతో ప్రజల హృదయాలు సృశించలేదా ?**

సాటి తెలుగువాడు ఎస్పీ మనవాడు కానప్పుడు .. పరాయి రాష్ట్రం వాడు,పరాయి దేశం వాడు మన వాడు ఎలా ఎవుతాడు?.

ఏహె... వీళ్ళంతా విశ్వమానవులే, బాలు కూడా మానవుడే అంటారా!..

అయితే మరి కమ్యూనిస్టు ఎర్ర వెర్రి తో విద్వేషాన్ని నింపుతున్న ఈ వ్యక్తుల ప్రేలాపనలేమిటి?

అసలు ఈ విద్వేష భావజాలం వెనక ఉన్న మతలబు ఏమిటని ఇప్పుడు విజ్ఞులు నుదురు గోక్కుంటున్నారు.

**» తమ విచ్ఛిన్న వాదం విఫలమయిందని కమ్యూనిస్టు ప్రభావిత వ్యక్తులు ముఖ్యంగా నక్సల్ ప్రభావిత శక్తులు తెలంగాణలో అరాచక వాదాన్ని రేపుతున్నారు అనే అభిప్రాయం నిజమనిపిస్తున్నది.**
**దాని కొరకు సాఫ్ట్ టార్గెట్ లను ఎన్నుకున్నారు అని బలమైన అభిప్రాయాలు వినిపిస్తున్నాయి**

**» కోమట్లు అంటూ ఒకసారి, బ్రాహ్మణులు అంటూ ఒకసారి, మార్వాడీలు అంటూ ఒకసారి సాధు స్వభావం గల వర్గాలను టార్గెట్ గా చేసుకుని సమాజంలో విభజన కార్యక్రమాన్ని అమలు చేయాలనుకుంటున్నారు**

**» ఇప్పుడు ఏకంగా అజాత శత్రువు, సాధు స్వభావి ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం గారిని టార్గెట్ చేసుకున్నారు**

ఎస్పీ బాలు గారు రాజకీయ నాయకుడు కాదు. అతడిని టార్గెట్ చేసుకుంటే అతని తరపున ఎవ్వరూ ప్రతిఘటన చేయరు.అందుకే సులభ లక్ష్యంగా బాలు గారిని ఎన్నుకున్నారు ఈ సామాజిక కార్యకర్తలు.
కులం పేరుతో రాజకీయం చేస్తూ కుల గణన



అంటూ ఏకంగా రాష్ట్ర ప్రభుత్వమే పనిచేస్తున్నది.కుల వివక్ష పోరాట సమితి,కుల నిర్మూలన సంఘం అంటూ సమావేశాలు పెట్టే వారు ఈ కుల గణన జరగాల్సిందే అంటున్నారు.కమ్యూనిస్టు ప్రభావిత కుల వ్యతిరేక సంఘాలు ఈ కుల వాదాన్ని,కుల గణనను వ్యతిరేకించరెందుకు?.
మతం పేరుతో పార్టీ పెట్టి హైద్రాబాద్ ను గుప్పిట పట్టిన మతోన్మాద పార్టీని వ్యతిరేకించరెందుకు?.
పైగా ఈ కుల మత వాదులకు వంతపాడే వాళ్ళు ఇంకా ఇలా ఎంతకాలం ఈ విచ్ఛిన్న వాదులను సహిస్తారు?.
తెలంగాణలో ఈ కొత్త పోకడ సమాజంలో అశాంతిని సంఘర్షణను రేపుతున్నది.
దీనితో సామరస్యం కోరుకునే యువతరం, అభివృద్ధిని కోరుకునే నవతరం ఆక్రోశం తో ఉన్నది.
సామాజిక వేత్తలు ఈ పరిణామాలను గమనిస్తున్నారు. ఈ విచ్ఛిన్న ధోరణి సరైనది కాదని మెల్లగా అయినా స్పష్టంగా తమ అభిప్రాయాన్ని వెల్లడిస్తున్నారు.
రవీంద్ర భారతిలో ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం విగ్రహ ఆవిష్కరించాల్సిన బాధ్యత ప్రభుత్వానిది. ఈ వ్యవహారాన్ని ప్రభుత్వం చూసుకుంటుంది.

**» బాలు గారి విగ్రహం ఉన్నా లేకున్నా అతని గొంతు ప్రతి ఇంట్లో మోగుతూనే ఉంటుంది. ప్రతి సెల్ ఫోన్ లో మోగుతూనే ఉంటుంది**

రవీంద్ర భారతి లో బాలు గారి విగ్రహం పెట్టకూడదన్న ఆ విచ్ఛిన్నకర ఉద్యమకారుడు సెల్ ఫోన్ లో కూడా బాలు గారి గొంతు మోగుతుంది.
బాలూ గారి విగ్రహం వద్దు.. అనే వారు ఒక పని చేయాలి. ముందుగా రవీంద్ర భారతి పేరు మార్చండి. ఎందుకంటే విశ్వకవి రవీంద్ర నాథ్ ఠాగూర్ పేరుతో రవీంద్ర భారతి ఏర్పాటు చేసారు..
**» రవీంద్ర నాథ్ ఠాగూర్ తెలంగాణ వాడు కాదు.కాబట్టి ఆ పేరు తొలగించాలని ఉద్యమం చేయాలా?**

విశ్వజనీన సిద్ధాంతం అంటూ గతి లేని ప్రగతిశీల వాదులు నిత్యం సుభాషితాలు వల్లిస్తుంటారు.
ఏ కమ్యూనిస్టు పార్టీ నాయకుడు గాని, పార్టీ గానీ ఈ ముష్కర వాదన ఖండించలేదు.కమ్యూనిస్టు ప్రభావిత వ్యక్తులు కొందరు ఈ రకమైన అవాంఛిత వాదనలు చేస్తున్నారు. అశాంతిని రగిలించే ప్రయత్నం చేస్తున్నారు.మార్వాడీ గో బ్యాక్ అన్న వారు కమ్యూనిస్టు భావ జాలీకులు. బ్రాహ్మణ వాదులు అంటూ గొంతు వినిపిస్తున్న వారు కమ్యూనిస్టు ప్రభావితులు.
ఏకంగా బ్రాహ్మణులపై పాట పాడి దూషణ చేసిన వారు కమ్యూనిస్ట్ భావ ప్రేరితులు.

**» తెలంగాణ ఎప్పుడూ అభ్యుదయాన్ని కోరుకుంటుంది. విశ్వజనీన భావాన్ని స్వంతం చేసుకుంటుంది.అటువంటి తెలంగాణలో ఈ వికృత భావజాలం ఎలా పుట్టుకొస్తున్నది. దీన్ని ప్రోత్సహిస్తున్నదెవరు?**

» తెలంగాణ మనది. తెలంగాణలో పరాయి వ్యక్తుల స్మారకాలన్నీ రూపుమాపాలి.
**శంషాబాద్ ఎయిర్ పోర్ట్ కు రాజీవ్ గాంధీ పేరు తీసేయాలి. ఇందిరా గాంధీ పేరున హైదరాబాద్ నడిబొడ్డున పార్క్ ఎందుకు? ఊరూరా YSR విగ్రహాలెందుకు. వాటిని తొలగించాలి**

అంటూ, తెలంగాణలో ఇకపై ఇలాంటి వాదనలు బయలుదేరే అవకాశాన్ని కల్పిస్తున్న ఈ అసాంఘిక శక్తుల పట్ల ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలి..
ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం గారి పేరుతో ఉనికి లోనికి రావాలని ఇటువంటి చౌక ప్రచారం చేస్తున్న వారిని తెలంగాణ సమాజం లెక్కచేయదు.పట్టించుకోదు.
గాన గంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం కళామతల్లి ముద్దు బిడ్డ.
ఎస్పీ బాలసుబ్రమణ్యం తెలంగాణకు చేసిన సేవ ఏమిటి అనేది ప్రశ్న అంటూ తెలంగాణ భావోద్వేగం పేరుతో విచ్ఛిన్న కారులు అడగవచ్చు.. మరి సూటిగా అడగాలంటే మార్క్స్,లెనిన్,మావో లు తెలంగాణకు చేసిన సేవ ఏమిటి అనే తిరుగు ప్రశ్న ఉదయిస్తుంది.
కళాకారులు,సాహిత్య కారులు తమ గొంతుతో కలం తో సమాజాన్ని సృశిస్తారు.

నిత్య పరిణామాలను ఇముడ్చుకుంటూ తెలంగాణ పురోగమిస్తున్నది. యువత కూడా అదే గతి శీలంతో సహజీవనం చేస్తున్నది.
**ఈ ఆధునిక కాలంలో మూస వాదాలతో తెలంగాణాను ఒకేచోట కట్టి పడేయగలమా!**

సరళ లక్ష్యం అనుకుంటూ అసంఘటిత సమాజాలను పీడిస్తే తిరుగుబాటు వస్తుంది.
కోమట్లు,బ్రాహ్మణులు,మార్వాడీలు,పరాయి కళాకారులు అంటూ కొంత యాగీ చేయగలరేమో కానీ ఉన్నత సమాజాన్ని నిర్మించలేరు.

**సంఘర్షణ కాదు, సంస్కరణ కావాలి.అన్ని భావాల్లోని మంచిని సమన్వయం చేయాలి.**

తెలంగాణ యువతకు ప్రజలకు నిర్మాణాత్మక కార్యాచరణ, ఉత్పత్తి కారక విధానాలు నేర్పాలి.
ఈ విచ్ఛిన్న వాదాలు సమయాన్ని హరిస్తాయి. అభివృద్ధిని నిరోధిస్తాయి.
జయ జయహే తెలంగాణ జననీ జయ కేతనం గీతంలోని స్వరాష్ట్రమై తెలంగాణ స్వర్ణయుగం కావాలి అనే ఒక్క లైన్ పై ఎస్పీ అభ్యంతరం చెప్పాడని ఈ నియో ఉద్యమకారులు అంటున్నారు.
ఈ విషయం ఇప్పుడు వెలుగు చూసింది.ఒకవేళ ఎస్పీ బాలు గారు తన అభిప్రాయం చెప్పిఉంటే మనం ఎప్పుడైనా ఇప్పుడైనా నిరసన తెలుపవచ్చు. కానీ అతని కళా సేవను కించపరచకూడదు.

తెలంగాణ ఉద్యమకారులపై దాడి చేయడానికి లాఠీతో ఉరికినోళ్లను ఎమ్మెల్యేలుగా గెలిపించింది ఈ తెలంగాణ సమాజం.
తెలంగాణ ఉద్యమ ద్రోహులను మంత్రులుగా చేసింది ఈ తెలంగాణ సమాజం.

**అటువంటి తెలంగాణ ఎస్పీ బాలు గారిని ఆదరించదా!.**

తెలంగాణ కొరకు వందలాది బిడ్డలు తమ ప్రాణాలను బలిపెట్టి మనకు అభ్యుదయ తెలంగాణను అందించారు.

**» అవాకులు చవాకులు పేలుతూ తమ భావ ప్రకటనా హక్కును ఉపయోగిస్తున్న వారు, ఎస్పీ బాలుకు భావ వ్యక్తీకరణ స్వేచ్ఛలేదని అనగలరా?**

సాధించుకున్న తెలంగాణలో ప్రజలకు సరైన దిశ చూపించి ప్రగతిశీల, వికసిత తెలంగాణాను అందించాల్సిన బాధ్యత అందరిదీ.

**» ఈ వికృత క్రీడలతో, విచ్ఛిన్న వాదాలకు తెలంగాణ రంగు అద్ది .. ఆటలాడే వ్యక్తులను శక్తులను పసిగట్టి అదుపు చేయాల్సిన బాధ్యతప్రభుత్వానిది.**
ప్రజలది కూడా

**భారతావని పసిడి కూన .. కోటి కోటి రతనాల వీణ మన తెలంగాణ.**

**ఈ రతనాల తెలంగాణలో సామరస్యమే అభివృద్ధికి హేతువు అవుతుంది.**

**అన్నింటిలోని, అందరిలోని మంచి సమన్వయం చేయాలి.**
**నూతన తెలంగాణ నిర్మాణం చేసుకోవాలి.**

# అడిషనల్ కలెక్టర్ ఇంట్లో ఏసీబీ సోదాలు

**- భారీగా నోట్ల కట్టలు స్వాధీనం**



**పతి, కరపత్రం ప్రతినిధి భూపాలపల్లి నియోజకవర్గం** హన్మకొండ అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి ఇంట్లో శనివారం ఏసీబీ అధికారులు తనిఖీలు నిర్వహించగా, భారీగా నగదు, భూమి పత్రాలు బయటపడ్డాయి. శుక్రవారం రూ.60 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడిన అదనపు కలెక్టర్‌ను అరెస్ట్ చేసిన నేపథ్యంలో ఈ సోదాలు జరిగాయి. హన్మకొండలోని ఆయన నివాసంలో రూ.30 లక్షల 30 వేల నగదు, భూమి పత్రాలు, లాకర్లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ వ్యవహారంపై అధికారులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు.

# డీకే శివకుమార్‌కు ఈవోడబ్ల్యూ నోటీసులు

కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌కు నేషనల్ హెరాల్డ్ కేసులో మరోసారి ఉచ్చు బిగుస్తోంది. ఈ కేసుకు సంబంధించి ఆర్థిక నేరాల విభాగం (ఈవోడబ్ల్యూ) పోలీసులు ఆయనకు నోటీసులు జారీ చేశారు. కేసులోని కొన్ని ఆర్థిక విషయాలు, లావాదేవీలపై వివరణ ఇవ్వాలని నోటీసులో కోరారు. విచారణకు హాజరు కావాలని కూడా ఆదేశించినట్లు తెలుస్తోంది. నేషనల్ హెరాల్డ్ పత్రికకు సంబంధించిన ఆర్థిక వ్యవహారాల్లో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలతో ఈ కేసు చాలాకాలంగా నడుస్తోంది. ఇప్పటికే ఈ కేసులో కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ సహా పలువురు విచారణ ఎదుర్కొన్నారు.

# అంబేద్కర్ 69వ వర్ధంతి సందర్భంగా జమ్మికుంటలో ఘన నివాళులు

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట, డిసెంబర్ 6:** భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బీ.ఆర్. అంబేద్కర్ 69వ వర్ధంతి సందర్భంగా జమ్మికుంట అంబేద్కర్ చౌక్‌లో ఘనంగా నివాళు లర్పించారు. సీనియర్ వకీల్ మోలుగూరి సదయ్య ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించడం జరిగింది.
కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా జమ్మికుంట మున్సిపాలిటీ కమిషనర్ మహమ్మద్ ఆయాజ్, వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ ఎరం సతీష్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి అరుకల వీరేషలింగం, కాంగ్రెస్ డీసీసీ ప్రధాన కార్యదర్శి గూడెపు సారంగపాణి, అంబేద్కర్ సంఘ నాయకులు పాత సత్యం, వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్ సూర్య తదితరులు హాజరయ్యారు.
యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బూడిగే శ్రీకాంత్, నాయకులు ప్రభు దాస్, చెంద్రగిరి శ్రీనివాస్, తిరుపతి శ్రీనివాస్, గుల్లి జెపాన్, చందపాషా, నరిగే సుమన్, పాతకాల ప్రవీణ్,



అశోక్, దొడ్డె నవీన్, ఉడుగుల మల్లయ్య, ఏభూషి రాజయ్యతో పాటు వివిధ పార్టీల నాయకులు, సంఘాల ప్రతినిధులు, మున్సిపల్ సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.
**మహమ్మద్ ఆయాజ్ ఈ సందర్భంగా మాట్లాడుతూ**
“భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి మత, వర్ణ, వర్గాలకు అతీతంగా సమాన హక్కులను కల్పించింది. ఈ దారిని చూపింది డాక్టర్ బీ.ఆర్. అంబేద్కర్ చూపిన మహోన్నతమైన దృష్టి,” అని పేర్కొన్నారు.



**మోలుగూరి సదయ్య మాట్లాడుతూ**
“అంబేద్కర్ సమాన హక్కులు, సామాజిక న్యాయం కోసం జీవితాంతం పోరాడారు. ప్రత్యేకంగా లింగభేదం లేకుండా ఓటు హక్కు ద్వారా ప్రతి ఒక్కరికి బలమైన ఆయుధాన్ని ఇచ్చారు. బోధించు.. సమీకరించి.. పోరాడు.. అనే ఆయన సూక్తి సమాజ చైతన్యానికి మార్గదర్శకం,” అని అన్నారు. అంబేద్కర్ సేవలను స్మరించుకుంటూ కార్యక్రమం సందర్భంగా పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొని మర్యాదపూర్వకంగా ఘన నివాళులర్పించారు.

